పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 87. అల్ ఆలా సూరా పరిచయం

అవతరణ : మక్కా, ఆయత్‌లు 19, ఒక రుకూ.

ఈ సూరా మక్కాలో అవతరించింది. ప్రారంభ సూరాలలో ఇది ఒకటి. ఆయన ఖుర్‌ఆన్‌ను గ్రహించడంలో ఎక్కడయినా ఏదయినా ఆయత్‌ను మరచిపోతానేమో అన్న సందిగ్ధంలో ఉన్నారు. అల్లాహ్ ఆయనకు ఖుర్‌ఆన్‌ను శ్రద్ధగా వినండి. మీకు కంఠస్తం చేయించడం, అర్థాన్ని వివరించడం అల్లాహ్ బాధ్యత. మీరు దాని గురించి ఆందోళన చెందకండి అని ఓదార్చాడు. దీనిలోని అంశం పరలోక విజయం. ఖుర్‌ఆన్ రూపంలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంపై వచ్చిన హితబోధను స్వీకరించిన వారికి పరలోక విజయం లభిస్తుంది.

విశిష్ఠత : ముక్తసరిగానే ఉన్నప్పటికీ ఈ సూరా తౌహీద్ (ఏకత్వం), రిసాలత్ (దైవదౌత్యం) మరియు ఆఖిరత్ (పరలోకం) అనే అంశాలపై ఆధారపడి ఉంది. అందువల్ల ఈ సూరాను శుక్రవారం మరియు పండుగల సందర్భంగా పఠించడానికి తగినదిగా చెప్పబడింది. అందుచేత దైవప్రవక్త (స) శుక్రవారం మరియు పండుగ దినాలలో “సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా మరియు హల్ అతాక హదీసుల్ గాషియ” (అంటే సూరతుల్ ఆలా మరియు సూరహ్ గాషియ) పఠించేవారని ఒక హదీసులో పేర్కొనబడింది. (సహీహ్ ముస్లిం – హ.నెం.1452)

## 87. అల్ ఆలా

**ఆయత్‌లు : 19** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఓ ప్రవక్తా! పరమోన్నతుడయిన నీ ప్రభువు పవిత్రతను వెల్లడించు. ఆయన ప్రతి దోషం నుండి పవిత్రుడు అని (2) ఎవరైతే పుట్టించాడో, తగినట్లుగా చేశాడో (3) ఎవరైతే ప్రణాళికా రచన చేశాడో, మార్గదర్శకం చేశాడో (4) ఎవరైతే వృక్షజాలాన్ని పండించాడో (5) ఇంకా వాటిని దట్టంగా సస్యశ్యామలం చేశాడో. (6) ఓ ప్రవక్తా! మేము నిన్ను చదివింపజేస్తాము. ఆ తర్వాత నీవు మరచిపోవు. (7) కాని అల్లాహ్ కోరినది. ఆయన బహిరంగ విషయాన్ని, గోప్యమయిన విషయాన్ని ఎరుగు.

آياتها 19 | سورة الأعلى 87 مكية | ركوعها 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

سَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى ﴿1﴾ الَّذِي خَلَقَ
فَسَوَّىٰ ﴿2﴾ وَالَّذِي قَدَّرَ فَهَدَىٰ ﴿3﴾
وَالَّذِي أَخْرَجَ الْمَرْعَىٰ ﴿4﴾
فَجَعَلَهُ غُثَاءً أَحْوَىٰ ﴿5﴾
سَنُقْرِئُكَ فَلَا تَنسَىٰ ﴿6﴾ إِلَّا مَا شَاءَ اللَّهُ
إِنَّهُ يَعْلَمُ الْجَهْرَ وَمَا يَخْفَىٰ ﴿7﴾

وَنُيَسِّرُكَ لِلْيُسْرٰى ﴿8﴾
فَذَكِّرْ اِنْ نَّفَعَتِ الذِّكْرٰى ﴿9﴾
سَيَذَّكَّرُ مَنْ يَّخْشٰى ﴿10﴾
وَيَتَجَنَّبُهَا الْاَشْقَى ﴿11﴾
الَّذِيْ يَصْلَى النَّارَ الْكُبْرٰى ﴿12﴾
ثُمَّ لَا يَمُوْتُ فِيْهَا وَلَا يَحْيٰى ﴿13﴾
قَدْ اَفْلَحَ مَنْ تَزَكّٰى ﴿14﴾
وَذَكَرَ اسْمَ رَبِّهٖ فَصَلّٰى ﴿15﴾
بَلْ تُؤْثِرُوْنَ الْحَيٰوةَ الدُّنْيَا ﴿16﴾
وَالْاٰخِرَةُ خَيْرٌ وَّاَبْقٰى ﴿17﴾
اِنَّ هٰذَا لَفِي الصُّحُفِ الْاُوْلٰى ﴿18﴾
صُحُفِ اِبْرٰهِيْمَ وَمُوْسٰى ﴿19﴾ ع 1 19 12

(8) మేము నీకు సులభ విధానాన్ని (అవలంబించే) సద్బుద్ధి నిస్తాము. (9) కాబట్టి నీవు హితబోధ చెయ్యి, హితబోధ చెయ్యడం గనక మేలయితే

(10) భయపడేవాడు హితబోధను స్వీకరిస్తాడు.

(11) భయపడని దౌర్భాగ్యుడు మాత్రమే మొగం త్రిప్పుకుంటాడు. (12) నరకంలోని పెద్ద అగ్ని గుండంలో ప్రవేశిస్తాడు. (13) ఇక అక్కడ చావనూ చావడు, బ్రతకనూ బ్రతకడు. (14) నిస్సందేహంగా పవిత్రతను అవలంబించిన వాడు సఫలుడయ్యాడు, (అంటే షిర్క్, బిద్అత్‌ల నుండి, అజ్ఞానం అలసత్వాల నుండి తప్పించుకున్నవాడు) (15) తన ప్రభువును స్మరిస్తూ ఉండేవాడు. నమాజ్ చేసినవాడు

(16) కాని మీరు ప్రాపంచిక జీవితానికే ప్రాముఖ్యం నిస్తున్నారు. (17) వాస్తవానికి పరలోకం ఉత్తమమైనది మరియు మిగిలి ఉండేదీ. (18) ఈ విషయం మునుపటి సహీఫాలలో కూడ ప్రస్తావించబడింది. (19) ఇబ్రాహీం, మూసా (అ) సహీఫాలలో కూడా.

1 – 5 వాక్యాలు

ఓ ప్రవక్తా! ఆందోళనపడకు. అల్లాహ్ నీకు తప్పక సహాయం చేస్తాడు. నీ ప్రభువు మహిమ గలవాడు. నేర్పుగలవాడు. సకల సృష్టికీ సార్వభౌముడు. ఎటువంటి దోషమూ లేనివాడు. లోపమూ లేనివాడు.

ఆయన నీకు సహాయం తప్పక చేస్తాడు. ఒకనాడు నీవు సఫలుడవు కాగలవు. ఏ విధంగా అల్లాహ్ మానవుడ్ని ఒక వీర్యపు బిందువు నుండి క్రమంగా వృద్ధిపరచి ఒక మనిషిగా చేశాడో, ఏ విధంగా భూమిలోని మొలక మామూలుగా బలహీనంగా ఉండి దైవ సహాయం వల్ల క్రమంగా పెరిగి పచ్చని ఆకులతో మహావృక్షం అయిపోతుందో, అదేవిధంగా ఇస్లాం దైవకృపవల్ల క్రమంగా వృద్ధి చెందుతుంది. నలువైపులా ఇస్లాం వాణి ప్రతిధ్వనిస్తుంది. ఈ సూరాలోనూ దీని తర్వాత వచ్చిన సూరాలలో దాదాపు పది సూరాలలో అల్లాహ్‌చే ఇస్లాం వృద్ధిచెందే సఫలమయ్యే శుభవార్త ఇవ్వబడింది.

6 – 13 వాక్యాలు

ఓ ముహమ్మద్ (స)! సత్యవిరోధులు, మంకుపట్టు పట్టే వారి పట్ల అంతగా శ్రద్ధ వహించకండి. ఇటువంటి వారు సత్యాన్ని స్వీకరించరు. వారు ముస్లింలు కారు. పైగా దైవశిక్షకు భయపడేవారు. పరలోక చింత కలవారు మాత్రమే సత్యాన్ని స్వీకరిస్తారు. ముస్లింలయిన మనకూ ఇందులో గుణపాఠం ఉంది. మనమూ అల్లాహ్‌కు భయపడటం లేదు. పరలోక చింత మనకు లేకపోయింది. ఫజర్, జొహర్, అసర్, మగ్‌రిబ్, ఇషా నమాజులు చదవడం లేదు.

అల్లాహ్‌కు భయపడకపోతే పరలోకంలో మన పరిస్థితి ఏమిటి? భయపడి జీవితం గడిపేవారికి, ఆయన్ని ఆరాధించే వారికి మాత్రమే సాఫల్యం లభిస్తుంది. దైవభయం లేని హృదయం, మృత హృదయం. ఎవరి జీవితంలోనయితే దైవభయం, దైవభీతి ఉండదో అది కాఫిర్ జీవితం మాత్రమే కాని ఒక ముస్లిం జీవితం కాజాలదు. మనం ఎటువంటి జీవితం గడుపుతున్నామో మనమే ఆలోచించుకోవాలి.

14 – 19 వాక్యాలు

పవిత్రతను అవలంబించిన వారు అంటే సత్యాన్ని స్వీకరించి, దాని ప్రకారం ఆచరించినవారు, అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడిపిన వారు. అంతిమ దిన సన్నాహాలలో సదాచరణ చేస్తుండిన వారు. ఇటువంటి వారికే సఫలవంతమయిన జీవితం. తిరస్కారులు బహుదైవారాధకులు, అపవిత్రులు. ఎందుకంటే వారు ప్రాపంచిక వ్యామోహం, కోరికల వ్యామోహం, ధన వ్యామోహం, భూములు, జాగీర్ల వ్యామోహంలో చిక్కుకున్నారు. ప్రపంచమూ, ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం తప్ప, అల్లాహ్ పట్ల, పరలోకం పట్ల ఎటువంటి ఆసక్తి, అభిరుచీ ఏమాత్రమూ లేవు. అల్లాహ్ కన్న మిన్నగా ఇతరుల పట్ల కోరిక కలిగి ఉండటం చెండాలం. పరలోకం కన్నా ప్రాపంచికతకు ప్రాముఖ్యతనివ్వడం చెండాలం. దైవప్రవక్త (స) విధానాన్ని విడనాడి మరోవిధానాన్ని ఇష్టపడటం చెండాలం. అల్లాహ్ ఆదేశానికి భిన్నంగా కోరికల ప్రకారం నడుచుకోవటం చెండాలం. కాబట్టి తనను తాను మలినం నుండి పవిత్రం చేసుకున్నవారే సఫలుడయిన మానవుడు. తనను తాను పవిత్రవంతం చేసుకోని వాడు ప్రపంచంలోనూ పరలోకంలోనూ విఫలుడవుతాడు.